క్లుప్తంగా

నేడు కోమటిలంకలో ఆరోగ్య సురక్ష

ఏలూరు రూరల్: ఏలూరు మండలం కోమటిలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ బి.ప్రణవి తెలిపారు. సాయంత్రం 4 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు.

నేడు కొవ్వలిలో..

దెందులూరు: కొవ్వలిలో గురువారం సర్పంచ్ ఇంటేటి మధులత అధ్యక్షతన ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు దెందులూరు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. కొవ్వలిలో మొటపర్తి భవన్‌లో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తామని శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య వృత్తి పవిత్రమైంది

పెదవేగి : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, విలువలతో కూడినదని ఈ విషయాన్ని వైద్య విద్యార్థులు గుర్తుంచుకోవాలని విజయవాడ డాక్టర్ వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో 17వ కాన్వకేషన్ - 2018 అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 2020 పోస్ట్ గ్రాడ్యుయేట్స్ విద్యార్థులకు బుధవారం రాత్రి పట్టాలు అందించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కోరుకొండ బాబ్జి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ జి మోజెస్, ప్రిన్సిపాల్ ఎన్ స్లీవరాజు, కళాశాల అడ్మినిస్ట్రేటర్స్ ఫాదర్ ఫెలిక్స్, ఫాదర్ ఎం ధర్మరాజు, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి జాకబ్, వీడీఎంసీ ట్రస్ట్ నంబర్లు, ఫాదర్ ఐ మైకేల్, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథి హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బాబ్జి, బీడీఎస్, ఎండీఎస్ విద్యార్థులకు పట్టాలను అందించారు. ముందుగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించారు.

దెందులూరులో ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రం

దెందులూరు: దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రజలందరి సౌకర్యార్థం ఎస్‌బీఐ ఖాతాదారులు సేవాకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం నిర్వాహకులు శింగవరపు అన్వేష్ అన్నారు. బుధవారం దెందులూరులో ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతా తెరవడం, నగదు బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం తదితర బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసుకోవచ్చని, ఏ బ్యాంకులకు సంబంధించిన సేవలైనా వినియోగించుకోవచ్చని తెలిపారు.

నేడు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

22 అంశాలతో అజెండా

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ సర్వసభ్య ప్రత్యేక సమావేశం గురువారం ఉదయం 10.45 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించనున్నారు. 22 అంశాలతో కూడిన అజెండా ఆమోదానికి కౌన్సిల్ సభ్యుల ముందు ఉంచనున్నారు. అభివృద్ధి పనులు, పరిపాలన సంబంధిత అంశాలపైనా సభ్యుల ఆమోదం కోరనున్నారు.

అజెండాలో కొన్ని..

- ఏలూరు కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ ఖాళీలను భర్తీని ప్రధాన అంశంగా ఉంచారు. ఇప్పటికే స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేస్తున్న అడ్వకేట్ ప్రత్తిపాటి తంబి, టీఆర్ఆర్ మోహనరావు పదవికాలం ముగియడంతో ఈ రెండు ఖాళీల భర్తీకి అధికారులు నిర్ణయించారు.


ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

- ఏలూరు నగరపాలక సంస్థ మేనేజర్ సీహెచ్‌వీవీ మూర్తిపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో గతంలో జాయింట్ కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి పి.అరుణ్‌బాబు విచారణ చేసి మేనేజర్‌పై చర్యలు తీసుకునేందుకు ఏసీబీకి లేఖ రాశారు. దీని ఆధారంగా మూర్తిని సస్పెండ్ చేయగా, దీనిపై రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మూర్తిని విధుల్లోకి తీసుకోవాలంటూ ఆదేశించింది. ఈ నేపథ్యంలో మేనేజర్ మూర్తిపై వచ్చిన అవినీతి ఆరోపణలు వాస్తవమని, అతన్ని 2023 జనవరి 18 నుంచి విధులు నిలుపుదల చేసేందుకు కౌన్సిల్ ఆమోదానికి ఉంచారు.
- ఏలూరు అశోక్‌నగర్ ఏటిగట్టు, హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.97.50 లక్షలతో అంచనాలు తయారు చేశారు.
- ఏలూరు నగరంలో ఐదు అర్బన్ పీహెచ్‌సీల నిర్మాణానికి అంచనాలు రూపొందించారు. ఒక్కొక్క యూపీహెచ్‌సీ నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. వీటి టెండర్‌లో సొమ్ము వ్యత్యాసాలకు సంబంధించి కౌన్సిల్ ఆమోదానికి సమర్పించారు.

గాజాపై ఇజ్రాయేల్ దాడిని నిలిపివేయాలి

ఏలూరు (టూటౌన్): గాజాపై అమెరికా ప్రోత్సాహంతో ఇజ్రాయేల్ కొనసాగిస్తోన్న మారణ హోమాన్ని ఆపాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఏపీ బేవరేజ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యూడెమొక్రసీ ఏలూరు నగర కార్యదర్శి బి.వెంకట్రావు మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయేల్ సాగిస్తోన్న యుద్ధాన్ని ఆపి శాంతిని, పాలస్తీనా ప్రజల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి, పాలస్తీనా భూభాగాల నుంచి ఇజ్రాయేల్ సైన్యం వెనక్కి వెళ్లాలని కోరారు. యుద్ధ విషయాలను వివరించేందుకు ఈనెల 19న స్థానిక వన్‌టౌన్ ప్రాంతంలోని అంజుమాన్ హాలు వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్, న్యూడెమొక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యర్రా శ్రీనివాసరావు, గడసాల రమణ, పల్లి గంగరాజు, కోరాడ అప్పారావు, చల్లా శ్రీను, చిన్ని నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



గాజాపై ఇజ్రాయేల్ దాడిని ఆపాలంటూ నినదిస్తున్న కార్మికులు

మహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ దర్శనం

ఏలూరు (టూటౌన్): దేవీ శరన్నవరాత్రులు నగరంలో వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం అమ్మవార్ల ఆలయాల్లో నిత్యపూజలు, కుంకుమ పూజ, లలితా సమాస్ర నామ పారాయణం, దేవీ ఖడ్గమాల పారాయణాలు నిర్వహించారు. పత్తేబాద నాలుగుళ్ల సెంటర్లని అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎస్ఆర్‌పేటకు చెందిన మహాంతి అప్పలనాయుడు, రమాదేవి దంపతులు అమ్మవారికి రూ.99,999 విలువగల వెండి చెంబు, బంగారపు నెక్లెస్, చంపసారాలు, రెండు బొట్లు బిళ్లలు సమర్పించుకున్నారు. మరో దాత రాజేశ్వరి రూ.8,500 విలువైన ముత్యాలు వెండి దండ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బీహెచ్ రామనాగ శంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు దిరిసిపాము రాజ్యలక్ష్మి, చోడవరపు వరలక్ష్మి, సారిక దుర్గ, శ్రీ లక్ష్మి, ఆలయ ఈఓ డి.శంకర్రావు పాల్గొన్నారు. బావిశెట్టివారిపేటలోని కనకదుర్గమ్మ వారు నాలుగో రోజు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నగరంలోని పలు ఆలయాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అలంకరణలు, పారాయణలు నిర్వహించారు.


అమ్మవారికి వెండి చెంబు, బంగారు వస్తువులు అందిస్తున్న భక్తులు


మహాలక్ష్మీ దేవి అలంకరణలో పత్తేబాద నాలుగు గుళ్ల సెంటర్ కనకదుర్గమ్మవారు

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. వట్లూరులోని రజకుల వృత్తి చెరువుల సమస్యపై ఆయన రజకులతో మాట్లాడారు. వట్లూరు చెరువును మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్‌తో పాటు రజక నేతలు క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. కట్లయ్య మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక జీఓలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారుల అవగాహనా రాహిత్యం వల్ల రజకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ఇరిగేషన్, మత్స్య శాఖల ఆధీనంలో ఉండే రజక వృత్తిదారుల చెరువులకు లీజులను ఆలస్యం చేయకుండా తీసుకోవాలని కోరారు. గత 60 సంవత్సరాల నుంచి రజకులు వట్లూరులోని 10 ఎకరాల చెరువులో వృత్తి చేసుకుంటున్నారని తెలిపారు. ఈ చెరువు కేటాయింపుపై ఆధారాలు లేవని మత్స్యశాఖ అధికారులు చెప్పడంతో సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ సతీష్, సిబ్బంది, రజక నాయకులు పాల్గొన్నారు.


వట్లూరు చెరువు విషయంపై రజకులతో చర్చిస్తున్న కట్లయ్య

ఉత్సాహంగా చదవడం మాకిష్టం


భీమడోలులో సామూహిక పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు


పెదవేగి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో దసరా సెలవుల నేపథ్యంలో నిర్వహిస్తున్న చదవడం మాకిష్టం శిక్షణ తరగతులు నాల్గవ రోజుకు చేరాయి. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన చిన్నారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం చిన్నారులకు డ్రాయింగ్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. లైబ్రేరియన్లు డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారు.

పెదవేగి : పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో దసరా సెలవులను పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథ పాలకుడు అరుణకుమార్ అన్నారు. దీనిలో భాగంగా బుధవారం చెస్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం దేశానికే ఆదర్శం

పెదపాడు: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పేదలకు ఇంటి వద్దే స్పెషలిస్టులతో కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆమె తెలిపారు. అప్పనవీడులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను, ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్, స్థానిక సర్పంచ్ చిన్నాల ఝాన్సీ,వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, ఎంపీటీసీ బుద్ధే రామసీత తదితరులు పాల్గొన్నారు.


అప్పనవీడులో మందుల కిట్‌ను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పేదలకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష

దెందులూరు: పేదలకు అండగా ప్రజలందరికీ తోడుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం అన్నారు. బుధవారం దెందులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, ఎంపీటీసీలు తోట విజయకుమారి, తాళ్మూరి నాగరాజు, పులిపాటి ఆనంద్, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు ఆధ్వర్యం వహించారు. దెందులూరు శివారు గ్రామాల నుంచి వచ్చిన 896 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దెందులూరు ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, వైద్య బృందం, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెదవేగి : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య తెలిపారు. బుధవారం పెదవేగి మండలం అమ్మపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్యతోపాటు కొప్పాక సొసైటీ చైర్‌పర్సన్ చళ్లగొళ్ళ భూస్వామి, సర్పంచ్ దేవరపల్లి ఏసుమరియమ్మ ఏబేలురాజు, ఎంపీటీసీ యర్రా అనురాధ కోటేశ్వరరావు, స్థానిక నాయకులు చందు సుబ్బారావు, జీవీ చంద్రశేఖర్, పరసా శివ, తహసీల్దార్ ఎన్ నాగరాజు, ఎంఈఓ 2 అరుణ్ కుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శులు, ప్రసాద్ స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొన్నారు.

20న ఆటోనగర్ ఎన్నికలు

ఏలూరు రూరల్: ఈ నెల 13న మల్కాపురం ఆటోనగర్‌లో కొందరు బయట వ్యక్తులు వచ్చి గలాటా సృష్టించడంతో వాయిదాపడిన ది ఏలూరు ఆటో మెబైల్ మోకానిక్స్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 20న నిర్వహించనున్నామని ఆటోనగర్ ఎన్నికల నిర్వహణ త్రిసభ్య కమిటీ సభ్యుడు ఆదాడ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఏలూరు సీఎస్ఐ స్కూల్ వద్ద అపోలో టైర్స్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్ ఆవరణలోని కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం పోలింగ్ పక్రియ చేపడతామన్నారు. సభ్యులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. మరో సభ్యుడు కర్రి మహేశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ సజావుగా సాగేందుకు పోలీసుల సహకారం కోరామన్నారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు పక్రియ పూర్తి చేస్తామన్నారు. పలువురు సభ్యులు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నాగభూషణంపై పలు ఆరోపణలు చేశారు.


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
డీ.తిరుమల ఏలురు బీహెచ్ఈఎల్	22.15	38
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	16
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	9
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	31
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

గౌడ సంఘం నేతల ఆత్మీయ సమావేశం

పెదవేగి : పెదవేగిలో మాజీ దెందులూరు నియోజకవర్గ ఏఎంసీ చైర్మన్ మేక లక్ష్మణరావు ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘీయుల సమావేశం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ నెల అక్టోబర్ 6న నియోజకవర్గ గౌడ సంఘ అధ్యక్షుడిగా విజయరాయి గ్రామానికి చెందిన మట్టా గోపాలరావు తనయుడు మట్టా రమా శంకర్‌ను, రాష్ట్ర గౌడ సంఘ చైర్మన్ జోగి రమేష్ ఆధ్వర్యంలో నియమించారని చెప్పారు. నియోజకవర్గ గౌడ సంఘ ప్రెసిడెంట్ మట్టా రమాశంకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 4 మండలాలకు గౌడ సంఘ అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గౌడ సంఘ చైర్మన్ జోగి రమేష్, మేకా శేషుబాబు, అంగర రామమోహన్, ఎంపీ మార్గాని భరత్, కొనకళ్ళ నారాయణ , కొనకళ్ళ జగన్నాథరావు (బొల్లయ్య), అనగాని సత్యప్రసాద్, ఉప్పాల హారిక రాము, మన ఏపీ రాష్ట్ర గౌడ సంఘ స్టేట్ కమిటీ సభ్యులు, దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘ సభ్యులందరితో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఆ సభలో దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘ పూర్తి కమిటీని ప్రకటిస్తామని అధ్యక్షుడు మట్టా రమా శంకర్ తెలిపారు. ఈ సమావేశంలో మాజీ దెందులూరు నియోజకవర్గ ఏఎంసీ చైర్మన్ మేక లక్ష్మణరావు, తాత సత్యనారాయణ, పెదవేగి మండల ఎంపీపీ రమ్యప్రసన్నకుమార్, మేకా వసంతరావు, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ మట్టా నవీన్, చల్లారి నాగబాబు, పరసా రంగారావు, చిట్టిబొమ్మ జగదీష్ పాల్గొన్నారు.


పెదవేగిలో సమావేశమైన గౌడ సంఘం నేతలు

మహిళలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తనిఖీ చేశారు. బుధవారం స్టేషన్‌కు వచ్చిన ఎస్పీ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలను సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై వెంకన్నల నుంచి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్‌ను పరిశీలించినట్లు చెప్పారు. జిల్లాలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. యువత గంజాయి, మాదక ద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అలాగే మహిళలపై దాడుల జరిగితే ఉపేక్షించబోమన్నారు. ఇప్పటికే ఏలూరులో జరిగిన యాసిడ్ దాడి ఘటనలో నిందితులను త్వరితగతిన అరెస్టు చేయడంతో పాటు, జీవిత ఖైదు పడేలా చేశామన్నారు. మహిళలపై ఎవరు దాడులకు పాల్పడినా ఇదే రీతిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలుత సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

గీత కార్మికుడికి గాయాలు

పెదవేగి : తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డ గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెదవేగి గ్రామానికి చెందిన తాతా సురేష్ బాబు బుధవారం ఉదయం తాటి చెట్టు పైనుంచి కల్లు దించుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సురేష్‌బాబు కుడికాలుకు తీవ్రగాయమైంది. దీనిని గమనించిన తోటి గీతకార్మికులు అతనిని ఏలూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుడికాలికి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
		అరటి కాయ (1)	07-10
టమాటాలు	20	చిక్కుడు కాయలు	80
వంకాయలు (గులాబీ)	28	చామదుంపలు	38
వంకాయలు (కాంతులు)	38	ములక్కాడలు	05-10
వంకాయలు (తెలుపు)	--	కంద	50
బెండకాయలు	20	బీట్‌రూట్	38
పచ్చిమిర్చి	34	కీరా దోస	46
కాకర కాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు	30	అల్లం	120-240
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	35
క్యారెట్	40	పాలకూర	10
దొండకాయలు	22	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	38	గోంగూర	06
గోరుచిక్కుడు	28	పుదీనా	05
దోసకాయలు	20	క్యాప్సికమ్	80
ఆనబకాయ (1)	15	చిలకడదుంప	30
పొట్లకాయ(1)	20	నిమ్మకాయలు (డజను)	--

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆశ్వీయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలకు విచ్చేయండంటూ గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు బుధవారం ఆహ్వానించారు. ముందుగా ఎమ్మెల్యే తలారిని దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఈఓ మర్యాద పూర్వకంగా కలిశారు. తలారికి శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈనెల 24న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 29 వరకు జరుగుతాయని, అందులో భాగంగా 26వ తేదీ రాత్రిన శ్రీవారి తిరుకల్యాణం, 27న రథోత్సవం వైభవంగా నిర్వహిస్తామని ఈఓ పేర్కొన్నారు.


తలారికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ ఈఓ

నిప్పలగుండం తొక్కిన భక్తులు

ద్వారకాతిరుమల: గుండుగొలనుకుంటలో కొలువైన శ్రీ కండిగలమ్మ అమ్మవారు, పోతురాజు స్వామివారి ఆలయం వద్ద బుధవారం రాత్రి నిప్పులగుండాన్ని నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ నిప్పుల గుండంలో కుంకుళ్లమ్మ, భవానీ దీక్షాదారులతో పాటు, పలువురు భక్తులు పాల్గొన్నారు.


నిప్పుల గుండాన్ని తొక్కుతున్న భవానీ దీక్షాదారులు

కలప రవాణా ట్రాక్టర్ పట్టివేత

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం చిర్రివారిగూడెం సమీపంలో అక్రమంగా జామాయిల్ బాదులు రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్టు అధికారులు, గ్రామస్తులు బుధవారం పట్టుకున్నారు. అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారంతో ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

వైఎస్సార్ జలకళ మోటార్ల పంపిణీ

కామవరపుకోట: సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైఎస్సార్ జలకళ మోటార్లను మండలంలోని రైతులకు బుధవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జెడ్పీటీసీ కడిమి రమేష్ అందజేశారు. రైతులకు ఏ విధమైన ఖర్చు లేకుండా ప్రభుత్వం ఉచితంగా బోర్లు తవ్వి, మోటర్లు అందజేయడం హర్షణీయమని అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, సర్పంచ్ కర్రిపోతూ అనూష, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, రాష్ట్ర ముతరాస సంఘ డైరెక్టర్ చుక్కల శ్రీనివాస్, ఎంపీడీవో కంతేటి శ్రీదేవి, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.